క్లుప్తంగా

పెంటమాంబ ఉత్సవాలు ప్రారంభం



పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ పంచాయతీ, నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలకు బుధవారం రాత్రి శ్రీకారం చుట్టారు. ఈ నెల 14న అమ్మవారి పండగను నిర్వహించనున్న నేపథ్యంలో దుర్గాలమ్మ అమ్మవారి ఘటాలకు పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ నెల 13 వరకూ అమ్మవార్ల ఘటాలను గ్రామాల్లో ఊరేగించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 14న అమ్మవారి పండగ, 15న అనుపు మహోత్సం ఉంటాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేశామని వివరించారు.

రామాలయం వరకు బస్సు నడపాలి



ఆర్టీసీ ట్రాఫిక్ మేనేజరుకు వినతి పత్రం అందిస్తున్న తిరుమలనగర్ వాసులు

కూర్మన్నపాలెం : వడ్లపూడి కాలింగవీధి రామాలయం వద్దకు బస్సు సర్వీసు నడపాలని తిరుమల నగర్ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో ట్రాఫిక్ మేనేజర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. 87వ వార్డులోని వివిధ ప్రాంతాల ప్రజలు ఎక్కడికి వెళ్లాలన్నా జాతీయ రహదారికి రావాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. దీనివలన వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రామాలయం వరకు బస్సు నడిపితే వెసులుబాటుగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. అయితే ట్రాఫిక్ మేనేజరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బస్సు నడిపే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. వినతి అందించిన వారిలో పరమానందం, సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

స్టీల్‌సిటీ డిపోలో ఎన్ఎంయూ నిరసన



ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్ సిటీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఉదయం నుంచి కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. డిపోలో జరిగిన కార్యక్రమంలో డిపో కార్యదర్శి జి. సాయిరామ్ మాట్లాడుతూ గతంలో కార్మికుల భద్రత నిమిత్తం అప్పటి ఎండీ సురేంద్ర బాబు ఉత్తర్వులను ఉల్లంఘించి ఇటీవల అనకాపల్లి డిపో నందు సిబ్బందిని సస్పెండ్ చేశారన్నారు. అదే విధంగా ఆర్టీసీ యాజమాన్యం రాష్ట్ర వ్యాప్తంగా ఇదే వైఖరితో వ్యవహరిస్తున్నదన్నారు. వెంటనే ఆ సిబ్బంది సస్పెన్షన్‌ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.ఎస్. వాసు, ఎ.ఆర్. రెహమాన్, బి.ఆర్. రావు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ అమలుపై హర్షం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ అమలుకు సహకరించినందుకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఉక్కు అధికారుల సంఘం (సీ), ఈపీఎస్ 95 పెన్షన్ వారియర్స్ కృతజ్ఞతలు తెలిపింది. గురువారం వారు ఆయనను కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు హయ్యర్ పెన్షన్‌కు అర్హులు కారని ప్రాంతీయ ప్రావిడెంట్ కమిషనర్ కార్యాలయం చెప్పిన దానిపై తామెంతో ఆందోళన చెందామన్నారు. దాంతో అనేక మంది ప్రజాప్రతినిధులను, కేంద్ర పీఎఫ్ ట్రస్టీలను కలిసి విన్నవించామన్నారు. ఎట్టకేలకు తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలపడం తమ బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సీ నాయకులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్, పెన్షనర్లు కుమారస్వామి, డి. శ్రీనివాస్, జె.ఎ. స్వామి, పి. వెంకటరావు పాల్గొన్నారు.

అతుక్కుపోయిన నిర్లక్ష్యం

బిక్కుబిక్కుమంటున్న స్థానికులు...

గతంలో ఇదే ఏ – బ్లాక్‌లో రోడ్డు పక్కన పలు రకాల ప్లాస్టిక్, సింథటిక్, వైర్లు వంటి వాటిని రోడ్డుపై డంప్ చేయడంతో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇప్పుడు వేసవి కాలం కావడంతో గొడౌన్ల యజమానులు తిరిగి భారీగా టన్నుల కొద్దీ ప్లాస్టిక్ బండిల్స్‌ను యథేచ్ఛగా రోడ్డుపైనే డంప్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో హెచ్‌టీ లైన్ల వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను అంటి పెట్టుకుని ప్లాస్టిక్ స్క్రాప్‌ను డంప్ చేస్తున్నారు. వీటిని ఆనుకొని నివాస ప్రాంతాలు ఉండటంతో నివాసితులు భయాందోళనకు గురవుతున్నారు.



ఆటోనగర్ రాంనగర్‌లోని ఏ - బ్లాక్ రోడ్డును ఆక్రమించి భారీగా డంప్ చేసిన ప్లాస్టిక్ స్క్రాప్





ఏ - బ్లాక్‌లో నివాసిత ప్రాంతం ఆనుకొని భారీగా డంప్ చేసిన ప్లాస్టిక్, సింథటిక్ వ్యర్థాలు



ఏ - బ్లాక్‌లో రోడ్డుపైనే తుప్పపట్టిన వాహనాల పార్కింగ్



రోడ్డును ఆక్రమించి డంప్ చేసిన ప్లాస్టిక్ బండిల్స్

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లోని అన్ని బ్లాక్‌లలో పారిశ్రామిక తయారీ రంగ పరిశ్రమలు ఉన్నాయి. కానీ ఆటోనగర్ రాంనగర్‌లోని ఏ – బ్లాక్‌లో మాత్రం 90 శాతం స్క్రాప్ గొడౌన్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. కోట్లాది రూపాయల టర్నోవర్‌తో పలు రకాల స్క్రాప్ గోడౌన్ల నిర్వహణ జరుగుతోంది. నిత్యం టన్నుల కొద్దీ ప్లాస్టిక్, ఐరన్, సింథటిక్, పేపర్ వంటి వ్యర్థాలను రోడ్డుపైనే బహిరంగంగా డంప్ చేస్తుండటంతో వేసవి కాలం కావడంతో ఎటు నుంచి అగ్ని ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

టన్నుల కొద్దీ స్క్రాప్ డంపింగ్...

ఏ-బ్లాక్ రోడ్డు సమీపంలో గొడౌన్లు ఉండడం.. నిత్యం స్క్రాప్ వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసి వీటిని బండిల్స్‌గా మార్చి యజమానులు నిర్లక్ష్యంగా వీటిని రోడ్లపైనే డంప్ చేస్తున్నారు. ఏ – బ్లాక్‌లో తయారీ రంగ పరిశ్రమలు పెద్దగా లేవు. ఒకటిరెండు మినహా పరిశ్రమలు కనిపించవు. కానీ ఇక్కడ మాత్రం భారీ పరిమాణంలో గొడౌన్లు ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వివిధ రకాల వస్తువులను స్టోర్ చేస్తుంటారు. ఇక్కడ నుంచి తిరిగి భారీ వాహనాలతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తుంటారు.

పర్యవేక్షణ లోపం

ఏ బ్లాక్ అంతా అస్తవ్యస్తంగా ఉండటంతో ఏయే పరిశ్రమలు ఉన్నాయి అనేది అయోమయంగా ఉందని పలువురు ఐలా అధికారులు అంటున్నారు. కోట్లాది రూపాయల టర్నోవర్‌తో ఐరన్, ప్లాస్టిక్, సింథటిక్ స్క్రాప్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఇంత వ్యాపారాలు సాగుతున్నా సంబంధిత అధికారులు సైతం కిమ్మనకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. ప్రజలు మాత్రం వేసవిలో అటు ఉక్కబోతతో పాటు వ్యర్థాల వల్ల ఎక్కడ అగ్నిప్రమాదం సంభవిస్తోందనని ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా రాములోరి పెళ్లి రాట మహోత్సవం



రామాలయం వద్ద పెళ్లి రాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు హరిజనజగ్గయ్యపాలెంలోని రామాలయం వద్ద శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, పెళ్లి రాట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం గ్రామానికి చెందిన శ్రీ అరుంధతి సేవా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ శ్రీ సీతారాముల వారి ఆలయం వద్ద సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నడుపూరు ఉపాధ్యాయినికి సత్కారం



పలకా మాధవికి డిజిటల్ ఎక్విప్‌మెంట్‌ను అందజేస్తున్న అధికారులు

పెదగంట్యాడ: రాష్ట్ర స్థాయి హాక్‌థాన్ కార్యక్రమంలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కస్తూరి సూర్యకిరణ్, ఉపాధ్యాయిని పలకా మాధవి సత్తా చాటారు. సమగ్ర శిక్ష, అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్, లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ సంయుక్తంగా నగరంలోని ఓ హోటల్‌లో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కోడింగ్‌లో శిక్షణ ఇచ్చి వారిలోని నైపుణ్యాలను పదును పెట్టడంతో పాటు కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌పై శిక్షణ ఇచ్చి విద్యార్థులను భవిష్యత్తు ఇంజినీర్లుగా తీర్చిదిద్దడంలో తన వంతు పాత్ర పోషిస్తున్న పలకా మాధవిని సత్కరించారు. అనంతరం ఆమెకు రూ. రెండు లక్షలు విలువ చేసే డిజిటల్ ఎక్విప్‌మెంట్‌ను అందజేశారు.

సీపీఐ బలోపేతానికి కృషి



కడిమి రాజుబాబును సత్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. తాండ్ర కనకరాజు అధ్యక్షతన గురువారం సీపీఐ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతర పోరు సాగిస్తామన్నారు. అలాగే పేదలందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేసేలా పోరాటాలు చేస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయాలకు సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అనంతరం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన కడిమి రాజబాబును సత్కరించారు. ఈ సమావేశంలో ఆనంద్, అచ్యుతరావు, విష్ణుమూర్తి, దుర్గారావు, పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

మల్కాపురం: సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 11వ తేదీన జీవీఎంసీ గాంధీ బొమ్మ విగ్రహం వద్ద జరగనున్న సభను పార్టీ కార్యకర్తలంతా జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నాయకులు కాండ్రేగుల సత్యంజనేయ పిలుపునిచ్చారు. మల్కాపురం గ్రామమండలి వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సత్యంజనేయ మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గాజువాక : గాజువాక: చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వివిధ ఫీడర్లకు శుక్రవారం మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా చినగంట్యాడ, చైతన్యనగర్, దత్తాత్రేయనగర్, కుంచమాంబ కాలనీ, చినగంట్యాడ ఎస్సీ కాలనీ, ఎర్రగెడ్డ కాలనీ, శ్రామినగర్, స్నేహపురి కాలనీ, శ్రీనివాసనగర్‌తోపాటు తహసీల్దార్ కార్యాలయం, జీవీఎంసీ జోనల్ కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి, కోర్టు కాంప్లెక్స్‌లకు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికురాలి మృతితో ఆందోళన



ఏఎంహెచ్‌వోతో పారిశుధ్య కార్మికుల వాగ్వాదం



భవాని (ఫైల్)

కూర్మన్నపాలెం: జీవీఎంసీ కాంట్రాక్ట్ కార్మికురాలు మృతి చెందింది. దీంతో ఆ కుటుంబానికి న్యాయం చేయాలని సహచర కార్మికులు గురువారం ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు, యూనియన్ నాయకులు రంగంలోకి దిగి చర్చలు జరపడంతో ఆందోళన సద్దుమనిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా.. వడ్లపూడి కణితి హైస్కూలు సమీపంలో నివాసముంటున్న పాకం గంగాభవాని (45) విధి నిర్వహణలో ఉండగా బుధవారం మధ్యాహ్నం సొమ్మసిల్లి పడిపోయింది. సమీపంలో ఉన్న కార్మికులు ఆమెను కూర్మన్నపాలెంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని ఇంటికి తరలించిన కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వాటర్ ట్యాంక్ సమీపంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పడాల రమణ, సీఐ మల్లేశ్వరరావు, ఏఎంహెచ్‌ఓ, కుటుంబ సభ్యులు, దుర్గా కన్స్టెటిన్సీ యాజమాన్యంతో చర్చించారు. రూ. 2.50 లక్షలు పరిహారం ఇవ్వడానికి, భవాని కుమారుడికి ఆ సంస్థలో ఉపాధి కల్పించడానికి అంగీకరించారు. అనంతరం కార్మికులు ఆందోళన విరమించి మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు.

అగనంపూడిలో లైబ్రరీ ఏర్పాటుకు వినతి

అగనంపూడి: రెండు వార్డుల్లో విస్తరించి ఉన్న అగనంపూడిలో లైబ్రరీ ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. 60 వేల పైచిలుకు జనాభా ఉన్న అగనంపూడిలో సీనియర్ సిటిజన్లు, విద్యార్థులకు ఉపయోగపడేలా స్థానికంగా నిరుపయోగంగా ఉన్న ఎన్టీఆర్ పార్క్‌లో లైబ్రరీ ఏర్పాటు చేయాలని, హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రిలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఉక్కు విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం లేకపోవడం వల్ల తెల్ల రేషన్ కార్డులు అందివ్వాలని, నిర్వాసిత కాలనీల అవసరాన్ని గుర్తించి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కర్రి దశేంద్ర, కరణం సత్యారావు, డొక్కా రమేష్, పొన్నగంటి వెంకటరమణ, అక్కరాజు గోవిందరాజులు, బండారు చందు కోరారు.

మస్తానప్ప ట్రస్ట్ సేవలు అభినందనీయం



పదవీ విరమణ ఉద్యోగులను సత్కరిస్తున్న దేవన్‌రెడ్డి, నాయకులు

ఉక్కునగరం: ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దివంగత వై. మస్తానప్ప పేరిట ట్రస్ట్ సేవలు అందించడం అభినందనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. ఇటీవల స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఆరుగురు వైఎస్సార్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలను వై. మస్తానప్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ మస్తానప్ప వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ట్రేడ్ యూనియన్‌కు ఎనలేని సేవలు అందించారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారు ఆరోగ్యం, ఆర్థికపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ట్రస్ట్ చైర్మన్ వై. వరలక్ష్మి మాట్లాడుతూ మస్తానప్ప ఆశయ సాధన కోసం ట్రస్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఆయనతో మొదట నుంచి ప్రయాణం చేసిన వారిని సత్కరించుకోవడం మా బాధ్యత అన్నారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డ గోవింద, గొందేశి రమణారెడ్డి, ఎన్నేటి రమణ, బి. రామకృష్ణ, డి. వెంకటేశ్వర్లు, శ్రీరాములు, జి. అప్పలరెడ్డి, పిట్టారెడ్డి, వై. నవీన్, బి. సాయి, నమ్మి ప్రసాద్, కర్రి రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన మురుగు



మింది నుంచి పారే మురుగు నీటి నాలాను మూసేసిన దృశ్యం



నీరు పారే అవకాశం లేక కాలువలో నిలిచిపోయిన మురుగు నీరు



మింది నుంచి పోర్టు రోడ్డుకు వెళ్లే మార్గంలో రోడ్డుపై మురుగు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ నుంచి మారుతీ జంక్షన్ వరకు నూతనంగా నిర్మిస్తున్న పోర్టు 6 రోడ్ల నిర్మాణంలో భాగంగా సుమారు 8 వరకు నాలాలను మూసేస్తూ నిర్మాణాలు చేపడుతున్న విషయం మార్చి 22వ తేదీన 'నాలాలను కప్పేస్తున్నారు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఇప్పుడు అదే నిజమైంది. నాలాలను కప్పేయడంతో 68వ వార్డు మింది గ్రామం నుంచి పోర్టు కనెక్టివిటీ రోడ్డుపైకి మురుగు నీరు ముంచేసింది. మూడు రోజుల పాటు ఈ రోడ్డుపై నుంచి పోర్టుకు వెళ్లే మింది నుంచి గాజువాక పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు, దినసరి కూలీలు మురుగులో నడుచుకుంటూ, ద్విచక్రవాహనాలపై వెళ్లడానికి తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న మింది గ్రామస్తులు రోడ్డు నిర్మాణం చేపడుతున్న సిబ్బందితో.. ప్రొక్లెయిన్ సహాయంతో తాత్కాలికంగా మురుగు నీరు వెళ్లేందుకు కాలువను ఏర్పాటు చేయించారు. వేసవిలోనే ఈ పరిస్థితి ఉత్పన్నమైతే రానున్న వర్షాకాలంలో పలు గ్రామాలకు చెందిన మురుగునీరు వెళ్లే కాలువల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో మురుగునీరు వెళ్లే కాలువలను ఒక ప్రణాళిక లేకుండా నాలాలను మూసేసి రోడ్లు నిర్మిస్తే చూస్తూ ఊరుకోం అంటూ విపత్తును ఎదుర్కొనే గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అర్హత గల అన్ని గృహాలూ క్రమబద్ధీకరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక : గాజువాక హౌస్ కమిటీ పరిధిలో అర్హత గల అన్ని గృహాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీవో నంబర్ 45 విడుదల చేసిందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గతంలో తమ ప్రభుత్వ హయాంలో జీవో 301 ద్వారా నామమాత్రపు రుసుముతో పట్టాలు ఇచ్చామని, దానికి అనుబంధంగా జీవో 45 తెచ్చామన్నారు. ఈ జీవో ప్రకారం వెయ్యి చదరపు గజాలలోపు గృహాలను క్రమబద్ధీకరిస్తామని, కటాఫ్ తేదీ 2023 డిసెంబర్ 31గా నిర్ణయించామని ఆయన చెప్పారు. గతంలో దరఖాస్తు చేయనివారు, చేసినవారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రుసుములు పెంచామని, గజం ధర రూ.25 నుంచి రూ.50కి, రూ.50 నుంచి రూ.100కి పెంచామని తెలిపారు. కమర్షియల్ భవనాలకు రెట్టింపు ధర ఉంటుందన్నారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో డబ్బులు చెల్లించిన వారికి మళ్లీ దరఖాస్తు అవసరం లేదని స్పష్టం చేశారు. 301 జీవోలోని తప్పులను సరిదిద్దుతామని, పోరంబోకు, గెడ్డల వాలు భూములకు త్వరలో పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. గాజువాకలో ముంపు లేనందునే క్రమబద్ధీకరణ చేస్తున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ మయాంక్ అశోక్ మాట్లాడుతూ, వంద గజాల వరకు ఉచితంగా పట్టా ఇస్తామని, రెండేళ్ల తర్వాత ఆస్తి అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీలేఖ, తహసీల్దార్ టి.శ్రీవల్లి, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, నాయకులు కోన తాతారావు, గోమాడ వాసు, కరణంరెడ్డి నర్సింగరావు, ప్రసాదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ మహోత్సవం

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-5 ట్రి వీక్లీ మార్కెట్ సమీపంలోని మరిడిమాంబ అమ్మవారి ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో భాగంగా మహిళలు లలితా సహస్రనామ పారాయణ, మరిడిమాంబ భజన మండలి వారిచే భజన నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఉక్కునగరం వీధుల్లో జరిగిన అమ్మవారి ఊరేగింపులో భక్తులు పాల్గొన్నారు. అనంతరం కూర్మన్నపాలెంకు చెందిన శ్రీకృష్ణ కళా మందిర్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన భరతనాట్య నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. టౌన్‌షిప్ కాంట్రాక్టర్లు బొడ్డ సన్యాసిరావు, టి. చక్రధర్‌రెడ్డి, ఎస్. రామకృష్ణ, వి. నాగరాజు, నాయుడులు తమ కార్మికులతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఎం. గణేష్, కార్యదర్శి బి. ఈశ్వరరావు, అప్పలనాయుడు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ఉత్సవ విగ్రహాలకు పూజలు



పూజలు నిర్వహిస్తున్న దాతలు, భక్తులు

అగనంపూడి: శ్రీరామ నవమిని పురస్కరించుకొని 85వ వార్డు అగనంపూడి బీసీ కాలనీలోని సీతారాముల ఆలయంలో దాతలు అందించిన ఉత్సవ విగ్రహాలకు పూజలు చేశారు. బీసీ కాలనీకి చెందిన విగ్రహ దాతలు గుంటూరు గణేష్‌కుమార్ రాజా, తులసీ దంపతులు చేతుల మీదుగా విగ్రహాలను ఆలయంలో ఏర్పాటు చేసి పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ చేసి సీతారాముల విగ్రహాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.